క్లుప్తంగా

వరద బాధితులకు రూ.4లక్షల విరాళం


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు రూ.4 లక్షల చెక్కు అందజేస్తున్న ప్రైవేటు స్కూళ్ల ప్రతినిధులు

తిరుపతి అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శనివారం తిరుపతి జిల్లా ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తరఫున ఎడిఫై, అకార్డ్, వెరిటాస్ సైనిక్ స్కూల్, సత్యా స్కూల్, కాండోర్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు తమ వంతు సహాయంగా రూ.4లక్షల చెక్కును కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు.

వరద బాధితులకు బియ్యం వితరణ

తిరుపతి(అలిపిరి): విజయవాడ వరద బాధితులకు పది కిలోల చొప్పున 120 సంచుల బియ్యాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు శనివారం జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులు అలహరి సుధాకర్, తోకల అశోక్ అందజేశారు. సుమారు రూ.50 లక్షల విలువైన నిత్యావసరాల కిట్లను త్వరలో వరద బాధితులకు పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా చిన్నలాలప్ప



తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ (ఏసీఎల్) గా చిన్నలాలప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఏసీఎల్‌గా ఉన్న ఆయన బదిలీపై తిరుపతికి వచ్చారు.

18న అన్నా క్యాంటీన్లు ప్రారంభం

తిరుపతి తుడా: తిరుపతిలో అన్నా క్యాంటీన్లను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె ఇంజనీరింగ్ అధికారులు, అక్షయపాత్ర నిర్వాహకులతో సమావేశమై సమీక్షించారు. అన్ని హంగులతో స్విమ్స్ కూడలి, న్యూ బాలాజీ కాలనీ, ముత్యాలరెడ్డిపల్లె, ఇఎస్ఐ హాస్పిటల్ వద్ద అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, ఆయా చోట్ల ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హెల్త్ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు విజయ్ కుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, రాజు, అక్షయపాత్ర నోడల్ ఆఫీసర్ చైతన్య, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, మెప్మా కృష్ణవేణి, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే స్పందించారు!


ప్యాచ్ వర్క్ చేయిస్తున్న స్థానికులు

తిరుపతి తుడా: తిరుమల బైపాస్ రోడ్డు నుంచి శివజ్యోతి నగర్ సాయిబాబా ఆలయానికి వెళ్లే మార్గం మెయిన్ రోడ్డు వద్ద రెండు నెలల క్రితం స్మార్ట్ సిటీ పనుల నేపథ్యంలో రోడ్డును తవ్వారు. ఆపై పనులు పూర్తిచేసి ప్యాచ్ వర్క్ చేయకుండా వదిలేశారు. రోడ్డులో గుంత వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో స్థానికులే ఏకమయ్యారు. సిమెంట్, ఇసుక, కంకర కొనుగోలు చేసి శని, ఆదివారాల్లో ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేశారు.

గురువులు ప్రత్యక్ష దైవాలు


టీచర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు నాని, శ్రీనివాసులు

తిరుపతి రూరల్: విద్యతో భవిష్యత్తును బంగారుమయం చేసే గురువులే ప్రత్యక్ష దైవా లు అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కొనియాడారు. తిరుపతి శిల్పారామంలో శనివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ఉపాధ్యాయులను సన్మానించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్, డీఈఓ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులాలకు అతీతంగా సేవలు: ఎమ్మెల్యే

తిరుపతి(అలిపిరి): కులాలకు అతీతంగా జనసేన పార్టీ సేవలందిస్తుందని.. జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్ని కులాలనూ సమానంగా చూస్తారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఒక హోటల్‌లో బలిజ విద్యాసంస్థల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. బలిజల్లోని పేద విద్యార్థులను చదివించడంలో మానవతా దృక్పథంతో విద్యాసంస్థల కరస్పాండెంట్లు వ్యవహరించాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో దుకాణదారులు ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని...లేదంటే షాపు లైసెన్స్‌లను రద్దు చేస్తా మని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన బస్టాండ్‌లోని తమ కార్యాలయంలో దుకాణదారులతో స మావేశం నిర్వహించారు.

ఎస్వీయూ ప్రొఫెసర్‌కి అవార్డు


ఎస్‌డీఎస్ మూర్తి

తిరుపతి సిటీ: ఎస్వీయూ బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఎస్‌డీ శ్రీనివాసమూర్తికి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ రినోవన్డ్ అకడమిక్ లీడర్‌షిప్ అచీవ్‌మెంట్ అవార్డు-2024 వరించింది. విజయవాడ ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఫౌండేషన్(ఐఎమ్ఆర్ఎఫ్) సంస్థ శనివారం ఈ మెయిల్ ద్వారా ఆయనకు సమాచారం ఇచ్చింది. ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో ఆయన చూపిన అసాధారణ ప్రతిభను గుర్తించి టీచర్స్ డే సందర్భంగా ఈ అవార్డును ప్రకటించింది.

మెడికల్ సీట్ల తగ్గింపు బాధాకరం



రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన మెడికల్ కళాశాలల్లో సీట్లను తగ్గించడం బాధాకరం. ఇదివరకున్న సీట్ల కంటే ఇంకా ఎక్కువ సీట్లు ఈ ఏడాది వస్తాయని భావించాం. వాటివల్ల నీట్ రాసిన నాలాంటి వారెందరికో మన రాష్ట్రంలోనే సీట్లు వచ్చేవి. అందులోనూ ప్రభుత్వ కళాశాలలు కావడంతో తల్లిదండ్రులకు చాలావరకు ఫీజుల భారం తగ్గేది. అయితే ఇప్పుడున్న ప్రభుత్వం సీట్లను తగ్గించడం, అసలు సీట్లే వద్దని చెప్పడం ఎంతమాత్రమూ సరికాదు.

–ఎం.హిమవర్ష, నీట్ విద్యార్థిని, తిరుపతి



లేఖను ఉపసంహరించుకోవాలి



రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలల వల్ల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా సమీపంలోనే చదువుకునే వెసులుబాటు ఉంటుంది. అంతేకాకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది. పైగా కొత్త కాలేజీల వల్ల పరిసర ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయి. ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఎందుకు సీట్లు వద్దని లేఖ రాసిందో అర్థం కావడం లేదు. దీనిపై పునరాలోచించి లేఖను ఉపసంహరించుకోవాలని కోరుతున్నా.

– ఎం.రెడ్డెప్పరెడ్డి, నీట్ విద్యార్థిని తండ్రి, తిరుపతి

వైభవంగా శ్రీ కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ, పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకువస్తున్న చెవిరెడ్డి రఘునాథరెడ్డి దంపతులు, స్థానికులు

- గ్రామంలో పవిత్ర మాలలు ఊరేగింపు
- శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠాపన

తిరుపతి రూరల్: మండలంలోని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులు కల్యాణ మండపంలోకి వేంచేపు చేశారు. యాగశాలలో వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించిన తర్వాత వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, మంజుల దంపతులు, స్థానికులు పవిత్ర మాలలను ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకువచ్చారు. మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా చేశారు. పంచామృతంతో ఉత్సవర్లను అభిషేకించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి గ్రామంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీగోవిందుని పవిత్రోత్సవాలు


ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో మూడు రోజుల పవిత్రోత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాలసేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులు యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పంచామృతంతో అభిషేకించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఆలయ యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునిక్రిష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

మార్వాడీల సంబరం



తిరుపతి కల్చరల్: రాజస్థాన్ మార్వాడీల ఆరాధ్య దైవం రామ్ దేవ్‌బాబా జయంతి వేడుకలను శనివారం తిరుపతిలో మార్వాడీలు సంబరంగా నిర్వహించారు. తీర్థకట్ట వీధిలో మొదట రామ్‌దేవ్‌బాబా చిత్రపటానికి పూజల అనంతరం పురవీధులలో ఊరేగించారు. వేలాది మంది మార్వాడీలు మంగళ వాయిద్యాల నడుమ చిందులు వేస్తూ, భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

స్టాఫ్ నర్సుల నిరసన


నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

తిరుపతి తుడా: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు శనివారం కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. రుయా నుంచి ఎస్వీ మెడికల్ కళాశాల ఆర్చి వరకు ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ తీసుకువచ్చిన జీవో 115 వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ జీవో వల్ల తాము ఉద్యోగ అవకాశాలు పూర్తిగా కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో అందించిన సేవలను గుర్తించి తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తులకు అన్నదానం

తిరుపతి గాంధీ రోడ్: స్థానిక కర్నాల వీధిలో నిర్వహిస్తున్న చవితి వేడుకల్లో భాగంగా శనివారం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. నగర మేయర్ డాక్టర్ శిరీష, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలువురు బీజేపీ నాయకులు, కర్నాల వీధి యూత్ సభ్యులు దీపక్ యాదవ్ ,గోపి ,వినోద్, సాయి పాల్గొన్నారు.

రక్త కణాల సంరక్షణపై దృష్టి


డాక్టర్ ప్రభు

తిరుపతి తుడా: రక్త కణాల సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని చెన్నై అపోలో ఆసుపత్రికి చెందిన ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ ప్రభు అన్నారు. తిరుపతిలోని అపోలో ఆసుపత్రిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనిషి ఆరోగ్యాన్ని కాపాడడంలో రక్త కణాలు కీలకపాత్ర పోషిస్తాయని ఆయన చెప్పారు. శరీరంలో నాలుగు ప్రధాన రక్త కణాలు ముఖ్యమైనవని, వాటిని కాపాడుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. రక్త సంబంధిత వైద్య సేవలను అపోలో అత్యాధునికంగా అందిస్తున్నట్టు తెలియజేశారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



తిరుపతి రూరల్(శ్రీనివాసమంగాపురం): శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీ భూదేవి సమేత కల్యాణ వెంకన్న స్వామి శనివారం బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి శనివారం సాయంత్రం స్వామి వారికి బంగారు తిరుచ్చి సేవ నిర్వహిస్తారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ కొనసాగిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ: నూతన ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగిస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్వీయూలో రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) ప్రథమ జాతీయ మహా సభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, వచ్చే బడ్జెట్ సమావేశాలలో సంక్షేమ వసతి గృహాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భీమరాజు, కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జి సురేష్ గౌడ్, నాయకులు శ్రీధర్, ప్రశాంత్, కృష్ణారెడ్డి, నీవన్‌కుమార్, చిరంజీవి, హరి, విజయ, హారతి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు


అన్నమాచార్య కాలేజీలో విద్యార్థుల కమ్యూనిటీ సేవా ప్రాజెక్టులను తిలకిస్తున్న దృశ్యం


శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో..


ఎస్వీసీఈ ఇంజనీరింగ్ కాలేజీలో..

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య, శ్రీరామ, ఎస్వీసీఈ ఇంజనీరింగ్ కళాశాలల్లో శనివారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్యలో ముఖ్యఅతిథిగా టీటీడీ డిప్యూటీ ఈఈ టి.సుప్రజ, శ్రీరామలో ప్రిన్సిపల్ కే.జయచంద్ర, ఎస్వీసీఈలో ప్రిన్సిపల్ డాక్టర ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నట్టు చెప్పారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. 'అన్నమాచార్య'లో ఎక్స్‌పో పేరుతో విద్యార్థులు ప్రదర్శించిన కమ్యూనిటీ సేవా ప్రాజెక్టులను అతిథులు తిలకించారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. అలాగే, 'శ్రీరామ','ఎస్వీసీఈ'లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో శ్రీరామ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, అరవింద్‌కుమార్‌రెడ్డి, అన్ని ఇంజనీరింగ్ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉన్నత స్థాయికి..!


శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలంటే చదువుల్లోనే కాకుండా వివిధ నైపుణ్యాలు కలిగి ఉండాలని, అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలరని ఎస్పీడబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ అన్నారు. శనివారం పద్మావతి మహిళా డిగ్రీ/పీజీ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి కల్పనలో నైపుణ్యాభివృద్ధి ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. విద్యార్థినులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపకరించిందన్నారు. శిక్షణలో కళాశాల నైపుణ్య శిక్షణ కన్వీనర్ డాక్టర్ కేపీ.పద్మజ, టీ.శ్రీనాథ్, నాంది ఫౌండేషన్ శిక్షకులు వేణుగోపాల్, రాజ్యలక్ష్మి, అధ్యాపకులు శ్రీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

22న 'ఘంటసాల ది గ్రేట్' బెనిఫిట్ షో

తిరుపతి కల్చరల్: తెలుగు పాట, పద్యాల ఖ్యాతిని ఖండాంతరాలు చాటి చెప్పిన అమర గాయకుడు ఘంటసాల జీవిత విశేషాలతో రూపొందించిన 'ఘంటసాల ది గ్రేట్ సినిమాని తిరుపతిలోని దేవేంద్ర థియేటర్‌లో ఈనెల 22న ఉదయం 8 గంటలకు ప్రదర్శిస్తున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన సొసైటీ ప్రతినిధులతో కలిసి ఘంటసాల పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

'నిర్వాణ'..మానవీయ విలువలకు ప్రేరణ


నిర్వాణ నవలను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: బౌద్ధుని ధర్మాలు, మానవీయ విలువలకు అద్దం పట్టేలా నిర్వాణ నవల ఉందని పలువురు ఉద్ఘాటించారు. ప్రముఖ రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన నిర్వాణ నవల ఆవిష్కరణ సభ శనివారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ బుద్ధిస్ట్ బొర్రా గోవర్ధన్ మాట్లాడారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆర్‌పీఐ రాష్ట్ర నేత పి.అంజయ్య, ఆకాశవాణి విశ్రాంత సంచాలకుడు మల్లేశ్వరరావు, టి.దామోదరం, రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప 'నిర్వాణ' గురించి విశ్లేషించారు.

మానసిక ఒత్తిళ్లకు గురిచేయొద్దు


జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సిమ్స్ డైరెక్టర్

తిరుపతి తుడా: విద్యార్థులను తల్లిదండ్రులు మార్కులు, ర్యాంకుల పేరిట మానసిక ఒత్తిళ్లకు గురిచేయరాదని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ కోరారు. శనివారం స్విమ్స్‌లో ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వీసీ మాట్లాడారు.డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ మాధవి, వనజాక్షమ్మ, సీనియర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ గణేష్, డాక్టర్ దుర్గాంజలి, యూజీ, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.